క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పుష్యమాసం రెండవ శనివారం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు.

తిరుమలలో కోలాటం



కోలాటంలో పాల్గొన్న మహిళలు

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన శ్రీసీతారామ కోలాట బృందం వారు అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమలలో నిర్వహించిన శోభాయాత్రలో కోలాటం నిర్వహించారు. ఈ కోలాటాన్ని శ్రీవెంకటేశ్వర భక్తిఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా కోలాట బృందం వారు మాట్లాడుతూ గురువు పెద్దుళ్లపల్లె శేఖర్ ఆధ్వర్యంలో కోలాటం నేర్చుకున్నామని, తిరుమల శ్రీవారి సన్నిధిలో తాము కోలాటం వేయడం ఆనందంగా ఉందన్నారు.

విన్నర్స్‌గా నరసాపురం టీం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కబడ్డీ పోటీల్లో నరసాపురం టీం విన్నర్స్‌గా నిలిచింది. వీరు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. విజేతగా నిలిచిన కబడ్డీ టీంను అధికారులు అభినందించారు.

శాంతియుతంగా ఉండాలి

పోరుమామిళ్ల : ఈనెల 22న అయోధ్యలో శ్రీ రామ మందిరంలో ప్రతిష్ఠ సందర్భంగా పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో అన్ని మతాలవారు శాంతియుతంగా ఉండాలని సీఐ చిరంజీవి కోరారు. శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్ని మతాలకు చెందిన శాంతికమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వెంకట్రామిరెడ్డి

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లెకు చెందిన ఓసూరి శౌరయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు పుల్లారెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. ఈ నేపథ్యంలో శనివారం ఏపీ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి శౌరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం రావాల్సిన బెనిఫిట్స్ వచ్చేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈయన వెంట ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పిల్లి రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాగృతి సంచిక ఆవిష్కరణ

మైదుకూరు : అయోధ్య రామ మందిరం నిర్మాణం, ప్రాణప్రతిష్ఠపై ప్రచురించిన జాగృతి ప్రత్యేక సంచికను శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ రాష్ట్ర సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, వీహెచ్‌పీ, హిందూ ఐక్యవేదిక, సమరసత సేవా ఫౌండేషన్ నాయకులు పాశం అనిల్, భాస్కర్‌రెడ్డి, వైపీ గోపాల్, నరసయ్య, మూలే భరత్ కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, రాఘువ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆరోగ్యానికి భరోసా



ప్రజలతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తో ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా లభిస్తోందని ప్రపంచ ప్రతినిధులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ ఆరీఫ్‌లు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు శనివారం కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె, కొత్తపల్లెలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను కలసి అధికారుల పని తీరు గురించి తెలుసుకున్నారు. కల్లూరు, కామనూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, సీహెచ్‌ఓలు దివ్యలక్ష్మీ, రజియాలతో మాట్లాడారు.

రైతు సంక్షేమంపై వైఎస్ జగన్ కృషి శ్లాఘనీయం

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- రైతుల సహకారంతోనే లాభాల్లోకి సహకార సంఘాలు
- ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



సమైక్య పథం పథకం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

మైదుకూరు : రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి శ్లాఘనీయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మైదుకూరు సిండికేట్ రైతు సేవా సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జనరిక్ ఔషధ కేంద్రాన్ని, రైతుల కోసం నాబార్డు అందజేసి మినీ రవాణా వాహనాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి పంటల సాగులో అవసరమైనవన్నీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమకూరుస్తున్నారని అన్నారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు రాకూడదని సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. వలంటీర్ల ద్వారా పింఛన్‌తో సహా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని, అదే విధంగా సొసైటీలో కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లను రైతుల ఇంటి వద్దకు చేర్చేందుకే సీఎం ఇప్పుడు రవాణా వాహనాలను సైతం అందిస్తున్నారని కొనియాడారు. మైదుకూరు సహకార సంఘం జిల్లాలోనే అగ్రగామిగా ఉందన్నారు.

రైతుల సహకారంతోనే లాభాల్లోకి సంఘాలు

రైతుల సహకారం ఉంటేనే సొసైటీలు లాభాల బాటలు నడుస్తాయని ఆప్కాబ్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాల వల్ల చాలా సొసైటీలు నష్టాల బాటలో నడిచాయని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రస్తుతం సహకార సంఘాలు, డీసీసీబీలు లాభాల బాటలో నడుస్తూ రైతులకు సేవలు అందిస్తున్నాయన్నారు. కడప డీసీసీబీ సభ్యులకు రూ.3వేల కోట్లు రుణాలుగా ఇచ్చిందన్నారు. మైదుకూరు సొసైటీ రైతులకు ఎన్నో రకాల సేవలు అందిస్తుందని తెలిపారు. ఇక్కడ పొదుపు చేసుకోవడంతోపాటు, రుణాలు, పురుగు మందులు, ఎరువులు, మినరల్ వాటర్ లభిస్తున్నాయని వివరించారు. సహకార సమైక్య పథం అనే పథకాన్ని కొత్తగా అమలు చేస్తున్నట్లు ఆప్కాబ్ చైర్‌పర్సన్ తెలిపారు. సొసైటీల ద్వారా ఎడ్యుకేషన్ లోన్లు కూడా తీసుకోవచ్చని, రైతులకు రెండేళ్లుగా 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను, పాడి రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ మైదుకూరు పూర్వ ఎమ్మెల్యే శెట్టిపల్లె పెద్ద నాగిరెడ్డి 1975లో మైదుకూరు సహకార సంఘాన్ని ప్రారంభించారని తెలిపారు. అప్పటి నుండి ఈ సంఘం దినదినాభివృద్ధి చెందిందన్నారు.

మోడల్ సొసైటీగా మైదుకూరు సంఘం

మైదుకూరు సిండికేట్ రైతు సేవా సహకార సంఘం మోడల్ సొసైటీగా మారనున్నట్టు నాబార్డు డీడీఎం బి.విజయ విహారి తెలిపారు. రైతులకు అవసరమైన సౌకర్యాలన్నీ ఈ సొసైటీ ద్వారా అందుతుండటమే ప్రాముఖ్యతకు కారణమన్నారు. కార్యక్రమంలో మైదుకూరులోని సీతారామ స్వయం సహాయక సంఘానికి డీసీసీబీ మంజూరు చేసిన రూ.15లక్షల రుణానికి సంబంధించిన మెగా చెక్కును, పలువురు పిల్లలకు కిడ్డీ బ్యాంకులను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వ్యవసాయ శాఖ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మైదుకూరు సహకార సంఘం చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు బండి హరినాథ్, ఏబీ చెంద్రాయుడు, డీసీఓ సుభాషిణి, డీసీఎల్ఓ సురేష్ కుమార్, ఆప్కాబ్ డీపీడీఎం వీరశంకర్, వ్యవసాయ శాఖ జిల్లా సలహాదారుడు కె.ఓబుళకొండారెడ్డి, డీసీసీబీ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామనామ జప మహాయజ్ఞం

బద్వేలు అర్బన్ : అయోధ్యలో ఈ నెల 22న జరగనున్న శ్రీరామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం శ్రీరామనామ జప మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు రామకోటిరాజు, కొండపల్లి సుభాష్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో సోమవారం సాయంత్రం 4–30 గంటల నుండి 6 గంటల వరకు యజ్ఞం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే 5 నుండి 10 సంవత్సరాల పిల్లలకు శ్రీరామచంద్రుని వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

23న జాబ్ మేళా

మైదుకూరు : మైదుకూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఎయిల్ డిక్షన్, నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ తోపాటు, హెవీ లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్లు తమ బయోడేటాతోపాటు సర్టిఫికెట్లను కూడా తీసుకొని జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజాభీష్టం మేరకే టవర్ క్లాక్ నిర్మాణం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



టవర్ క్లాక్ సాయిల్ టెస్టింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణ సుందరీకరణలో భాగంగా శివాలయం సెంటర్‌లో టవర్ క్లాక్‌ను నిర్మించాలని నిర్ణయించినట్టు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. టవర్ క్లాక్ నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న సాయిల్ టెస్టింగ్ పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు గౌరవాన్ని ఇనుమడింపజేసే విధంగా అమెరికాలోని అందమైన టవర్ క్లాక్ నమూనాతో 150 అడుగుల ఎత్తులో రూ.7 కోట్లతో టవర్‌ను నిర్మిస్తున్నామన్నారు. అందులో భాగమే పట్టణ నడిబొడ్డున జాతీయ జెండాను ఆవిష్కరించామన్నారు. ఫిబ్రవరి నుండి క్లాక్ టవర్ నిర్మాణం మొదలు పెట్టి ఏడాది కాలంలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్ కమాల్ బాషా, జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఎద్దుల రాయపురెడ్డి, ఏసీపీ మునిరత్నం, పద్మశాలీయ సేవా సంఘం పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై మహిళలకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

బద్వేలు అర్బన్ : పని ప్రదేశంలో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధానికి 2013లో అమల్లోకి వచ్చిన పీఓఎస్‌హెచ్ (పోష్) (ప్రివెన్షన్ ఆఫ్ ది సెక్సువల్ హెరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్) చట్టంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు పేర్కొన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం స్థానిక సీనియర్ సివిల్ కోర్టులో వివిధ శాఖల అధికారులతో సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు పోష్ యాక్ట్ కింద నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా మహిళలు సురక్షితమైన వాతావరణంలో పనిచేయడానికి వీలుంటుందని తెలిపారు. ఈ చట్టం గురించి ప్రతి కార్యాలయంలో అవగాహన కల్పించడంతో పాటు తోటి ఉద్యోగులు మహిళా ఉద్యోగుల పట్ల ఎలా ప్రవర్తించాలో తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ రవిచంద్ర, అర్బన్, రూరల్ సీఐలు యుగంధర్, విక్రమసింహ, సీనియర్ న్యాయవాదులు డి.బ్రహ్మారెడ్డి, డి.వి.ఎస్.ఆర్.క్రిష్ణ, వివిధ శాఖల అధికారులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మతసామరస్యం పాటించాలి

అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని కడప అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. అయోధ్యలోని రామమందిరంలో జరుగనున్న కార్యక్రమాల నేపథ్యంలో పట్టణంలోని పలువురు మత పెద్దలతో శనివారం సాయంత్రం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ అందరూ కుల మత బేధాలు లేకుండా సోదరభావాన్ని కలిగి ఉండాలన్నారు. కుల మతాలు వేరైనా అందరం భారతీయులమనే భావం ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, మెసేజ్‌లు, వీడియో, ఆడియో సందేశాలను నమ్మి శాంతికి విఘాతం కలిగించరాదని తెలిపారు. సీఐలు వెంకటరమణ, యుగంధర్, రమణారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక ప్రసంగీకులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని శ్రీస్వారాజ్యం ఆశ్రమంలో శనివారం బ్రహ్మశ్రీ జగద్గురు వేదాంత లక్ష్మణార్యులు రచించిన కేనోపనిషత్, ముక్తిసూక్తములు, ముక్తి పరమేశ్వర పంచ ముఖములు, సోహం దశావతారాలు అనే గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ గ్రంథాలను చదవడం వలన ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని బ్రహ్మశ్రీ శ్రీరామ చైతన్య స్వామి పేర్కొన్నారు. ఈ గ్రంథాల ముద్రణకు ధనిరెడ్డి వెంకటరెడ్డి, శివారెడ్డయ్య, వినోద్‌కుమార్, లక్ష్మీసంజమ్మ ఆర్థికంగా సహకరించారని ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు తెలిపారు. ఆదివారం ఆశ్రమ 82వ వార్షికోత్సవాలు, ఆధ్యాత్మిక సమావేశాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ రాష్ట్ర మాజీ సలహాదారుడు అంబటి కృష్ణారెడ్డి, ఏడీ ప్రసాద్, గుర్రం నమశివాయ, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన సాఫల్యం



డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి దంపతులకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న చిరంజీవి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం : ఎన్టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాలతో పాటు లోక్‌నాయక్ ఫౌండేషన్ 20వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం సంస్థ వ్యవస్థాపకుడు ప్రొ.యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖలోని రుషికొండలో శనివారం నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు రూ.2 లక్షల నగదు బహుమతితో సాహిత్య పురస్కారాన్ని ముఖ్య అతిథి చిరంజీవి చేతుల మీదుగా ప్రదానం చేశారు. అదేవిధంగా ప్రముఖ మనో వైద్యులు డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యాటక శాఖ నిపుణులు విల్సన్ సుధాకర్ తుల్లుమిల్లి, బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాధాకృష్ణంరాజుకి జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు.

పుస్తకాలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి గ్రంథాలయానికి కోటవీధిలోని కాంట్రాక్టర్ జి.రామనారాయణరెడ్డి జీఆర్ఈ, టోఫెల్, క్యాట్ తదితర పోటీ పరీక్షల పుస్తకాలను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగరాజుకు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామ నారాయణరెడ్డి తన స్నేహితుడైన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.హరినాథరెడ్డి ద్వారా పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు విద్యార్థి ఎంపిక



సీవీఎస్ ప్రశాంత్

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన విద్యార్థి సీవీఎస్ ప్రశాంత్ డొమస్టిక్ సీజన్ 2023–24 క్రికెట్ పోటీల్లో అండర్ -14 విభాగానికి సంబంధించి క్రికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 23 నుంచి గోవాలో జరగనున్న అంతర్‌రాష్ట్ర సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఈ విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల గుంటూరు జిల్లా పేరేచర్లలో జరిగిన జోనల్ క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభ సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

రేపు ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అయోధ్య రామమందిర విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్లో భాగంగా అభయవరద సీతారామస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్‌బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారి శాల నుంచి 108 మంది సుహాసినులు పూజా ద్రవ్యాలను ఆలయానికి తీసుకొచ్చి సీతారామస్వామికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేస్తారని పేర్కొన్నారు. వీహెచ్‌పీ, రామభక్తుల ఆధ్వర్యంలో పురవీధుల్లో బైక్ ర్యాలీ, 9 గంటలకు ఆలయంలో శ్రీరామ సంకీర్తనలు, అన్నమయ్య సంకీర్తన విభావరి ఉంటుందని వివరించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు తిలకించేందుకు పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో అయోధ్య బాల రాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు.

ప్రశాంతంగా రాత పరీక్షలు

జమ్మలమడుగు: నవోదయ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం ఉదయం మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాలకు చెందిన విద్యార్థులకు ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. బాలాజీ ఉన్నత పాఠశాలలో 192 మంది విద్యార్థులకు 105 మంది, సెయింట్ మేరీస్‌లో 192 మందికి 118 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ పరమేశ్వరయ్య తెలిపారు.

టైగర్ ఉనికిని కనుగొనండి

అట్లూరు : లంకమల అభయారణ్యంలో పెద్దపులి (టైగర్) ఉనికిని కనుగొనేందుకు ముమ్మర చర్యలు చేపట్టాలని నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ అధికారులు రమేష్, శ్రీధర్, సుబ్బరాయుడు పేర్కొన్నారు. అట్లూరు మండల పరిధిలోని కలివికోడి పరిశోధన కేంద్రంలో శనివారం సిద్దవటం, బద్వేలు, ఒంటిమిట్ట, వేంపల్లి, కడప రేంజ్ అధికారులతో సిద్దవటం రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని, అందుకోసం అధునాతన టెక్నాలజీతో కెమెరాలు అమరుస్తామన్నారు. పెద్దపులి ఉనికిని ఏ విధంగా కనుగొనాలి, ఏయే ప్రాంతాల్లో ఆ పులి సంచరిస్తుంది, అది నివసించేందుకు అనుకూల ప్రదేశాలు ఎలా ఉంటాయి అనే అంశాలపై సిబ్బందికి వివరించారు. సమావేశంలో సిద్దవటం సెక్షన్ అధికారి సురేష్‌బాబు, ఆయా రేంజ్ పరిధులలోని సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపులి ఉనికిని కనుగొనేందుకు సిబ్బందితో సమావేశమైన దృశ్యం

షాపింగ్ కాంప్లెక్స్‌తో మార్కెట్ కమిటీకి ఆదాయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో మైదుకూరు మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూరుతుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ యార్డు ఆవరణలో రూ.1.20 కోట్లతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు పశువుల సంతను స్థానిక బద్వేలు రోడ్డులోకి మార్చినట్లు తెలిపారు. గతంలో పశువుల సంత నిర్వహించిన మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.1.20 కోట్లతో 13 రూములతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, బీసీ విభాగం జిల్లా నాయకుడు ఇడగొట్టు శేషు, వనిపెంట ఎంపీటీసీ ఇర్షాద్, మాధవరాయస్వామి దేవాలయం చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, మార్కెటింగ్ శాఖ డీఈఈ సంపత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



రహదారి భద్రతా మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : రహదారి భద్రత అందరి బాధ్యత అని సీనియర్ ఎంవీఐ నారాయణ నాయక్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం ఆర్టీఓ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ట్రాఫిక్ సీఐ యుగంధర్, రూరల్ సీఐ రమణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీ నరసింహుడు, మున్సిపల్ ఈఈ సాయికృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు కనీస జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని చెప్పారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. బైక్‌లో వెళ్లే వారు తప్పకుండా హెల్మెట్ ఉపయోగించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని కోరారు.

నెల రోజులు అవగాహనా కార్యక్రమాలు

ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. కళాశాల విద్యార్థులకు, ఆటో, బస్సు, ఇతర భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. డ్రైవర్లకు కంటి పరీక్ష చేయడంతో పాటు, సెమినార్‌లు, ర్యాలీలు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం, రహదారి భద్రతపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రికెట్ విన్నర్ లైట్‌పాలెం జట్టు



విన్నర్ జట్టును అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య

ప్రొద్దుటూరు : ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం లైట్‌పాలెం, బాలాజీ నగర్ జట్ల మధ్య మండల స్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆసక్తికరంగా జరిగింది. లైట్‌పాలెం జట్టు 113 పరుగులు తీయగా, బాలాజీనగర్ జట్టు 55 పరుగులకే ఆల్ అవుట్ అయింది. మొత్తం 46 జట్లు పోటీలో పాల్గొన్నాయి. విన్నర్ జట్టును మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ మునిరత్నం పాల్గొన్నారు.

రోడ్డుకు భూమి ఇచ్చి సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : రాయచోటి – చాగలమర్రి జాతీయ రహదారి నిర్మాణానికి భూములు ఇచ్చి రైతులు సహకరించాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని 80.86 ఎకరాల భూమిని సేకరించేందుకు సర్వే చేశామన్నారు. రోడ్డు నిర్మాణం జరిగే నంగనూరుపల్లె, గోపవరం, గ్రామాల పరిధిలో ఎకరం భూమి విలువ రూ.10లక్షలకు పైగా ఉందని, కొత్తపల్లెలో రూ.కోటికిపైగా, ప్రొద్దుటూరు పరిధిలో రూ.72లక్షలకు పైగా ధరలు నిర్ణయించినట్లు ఆర్డీఓ వివరించారు. రోడ్డు పక్కన ఉన్న భూములకు సంబంధించి నంగనూరుపల్లె పరిధిలో రూ.25 లక్షలకుపైగా, గోపవరం పరిధిలో రూ.38 లక్షలకుపైగా, కొత్తపల్లెలో రూ.కోటి 28 లక్షలు, ప్రొద్దుటూరు పరిధిలో రూ.కోటి 65 లక్షలుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. రిజిస్ట్రేషన్ విలువల ఆధారంగా ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. ల్యాండ్ కన్వర్షన్ అయిన భూములకు సంబంధించి నంగనూరుపల్లె పరిధిలో రూ.67లక్షలు, గోపవరం పరిధిలో రూ.3.71 కోట్లు, కొత్తపల్లె పరిధిలో రూ.2.60 కోట్లు, ప్రొద్దుటూరు పరిధిలో రూ.4.28 కోట్లుగా గుర్తించామన్నారు.

ధరలు తక్కువగా ఉన్నాయని రైతుల ఆందోళన

ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామ పరిధిలోని కొంత మంది రైతులు అధికారులు నిర్ణయించిన ధరలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఇంత తక్కువ ధరలు నిర్ణయించడం తగదని తెలిపారు. ఈ సందర్భంగా గోపవరంలో ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పించాలని వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరెడ్డి కోరారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

రేపు అభివృద్ధి పనులు ప్రారంభం

గోపవరం : మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ సోమవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉదయం 8–30 గంటలకు కాలువపల్లె రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, 11 గంటలకు బేతాయపల్లె రైతుభరోసా కేంద్రం, పాలశీతలీకరణ కేంద్ర భవనం, 12 గంటలకు బ్రాహ్మణపల్లె ఎస్సీ కాలనీ నుంచి మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.